సాక్షి
పశ్చిమగోదావరి
సోమవారం । 24 । జూలై । 2023



ఆదమరిస్తే..

వర్షాకాలంలో పాముల బెడద ఎక్కువ. ఏ మాత్రం ఆదమరిచినా పాముకాటుకు గురికాక తప్పదు. అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. 8లో



శ్రీవారి కానుకలు సురక్షితం

శ్రీవారి నిత్య కల్యాణంలో స్వామి, అమ్మవార్లకు భక్తులు సమర్పించే కట్నకానుకలు పక్కదారి పట్టకుండా కంప్యూటర్ టికెట్లు ఇస్తున్నారు. 8లో



ఇద్దరి మృతి

కలపర్రు టోల్‌గేట్ వద్ద కారు డివైడర్‌ను ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. 8లో

న్యూస్‌రీల్

ఆలయాలను సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తి



న్యాయమూర్తి గోపాలకృష్ణరావు దంపతులకు మావుళ్లమ్మవారిని చిత్రపటాన్ని అందిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్) : ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జస్టిస్ వి.గోపాలకృష్ణరావు దంపతులు ఆదివారం భీమవరం పట్టణంలో ఆలయాలను సందర్శించారు. పట్టణ ఇలవేల్పు మావుళ్లమ్మవారిని దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. ప్రధానార్చకులు మద్దిరాల మల్లికార్జునశర్మ పూజాదికాలు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్, ఈఓ యర్రంశెట్టి భద్రాజీ జస్టిస్ గోపాలకృష్ణరావు దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేసి సత్కరించారు. అనంతరం జస్టిస్ గోపాలకృష్ణరావు ఉమా సోమేశ్వర జనార్దన స్వామి ఆలయాన్ని సందర్శించారు. ముందుగా అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. జస్టిస్ దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయ ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో స్వామివారి ప్రసాదాలను అందజేశారు. ధర్మకర్తల మండలి చైర్మన్ కోడే విజయలక్ష్మి, ధర్మకర్తలు కూర్మదాసు సత్య శ్రీనివాస్, నల్లం రఘుబాబు, లక్కు త్రిమూర్తులు, సోమాదుల లీలా ఈశ్వరి, తాణాల రామకృష్ణ, వి.వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

విజయవంతంగా 'జగనన్న సురక్ష'

4.44 లక్షల సర్టిఫికెట్లు మంజూరు



పి.ప్రశాంతి, కలెక్టర్

భీమవరం (ప్రకాశం చౌక్) : జిల్లాలో జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఈనెల 1 నుంచి ఇప్పటివరకు 476 సచివాలయాల పరిధిలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీల్లో 4,52,675 సర్వీసులను నమోదు చేయగా 4,44,787 సేవలు అందజేశామని పేర్కొన్నారు. 499 అర్జీలు సరైన ఆధారాలు లేనందున తిరస్కరించామని, 7,389 సేవలు అధికారుల పరిశీలనలో ఉన్నట్టు తెలిపారు. సురక్ష శిబిరాల్లో ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు 1,66,031, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు 1,62,364, ఆధార్‌కు మొబైల్ నంబర్ అనుసంధానం 5,168, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు 325, కొత్త రేషన్ కార్డులు, రైస్ కార్డుల స్ప్లిటింగ్‌కు 1,924, మ్యూటేషన్లు 204, హౌస్ హోల్డ్ నుంచి వివాహమైన వారిని వేరు చేయుటకు 297, వివాహ ధ్రువీకరణ సర్టిఫికెట్లు 93, సీసీఆర్ కార్డులు 5,270, జనన ధ్రువీకరణ పత్రాలు 297, మరణ ధ్రువీకరణ పత్రాలు 377 జారీ చేశామని పేర్కొన్నారు. సచివాలయాల ద్వారా సకాలంలో సర్టిఫికెట్లు అందిస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతిఒక్కరికీ ఈనెల చివరి వరకు జరిగే సురక్ష శిబిరాల్లో 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందించేందుకు చర్యలు చేపట్టినట్టు వివరించారు.

విజయవాడ వరకే గుంటూరు రైలు

నరసాపురం రూరల్: గుంటూరు పాస్ట్ పాసింజర్ రైలు వారం రోజులపాటు విజయవాడ వరకూ మాత్రమే వెళుతుందని నరసాపురం స్టేషన్ మాస్టర్ దివాకర్ తెలిపారు. నరసాపురం నుంచి గుంటూరు వెళ్లే ఈ రైలు ట్రాక్ మరమ్మత్తుల దృష్ట్యా ఇప్పటికే పలుమార్లు వాయిదా పడుతూ వచ్చింది. విజయవాడ–గుంటూరు మధ్య ట్రాక్ మరమ్మతులు కొనసాగుతుండటంతో ఈనెల 30 వరకు రైలును విజయవాడ వరకు మాత్రమే నడపాలని రైల్వే శాఖ అధికారులు నిర్ణయించారు.

పక్కాగా ఈ–క్రాప్ నమోదు

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లావ్యాప్తంగా ఈ–క్రాప్ నమోదుతో రైతులకు మేలు జరుగుతుందని జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ వై.రామకృష్ణ తెలిపారు. స్థానిక జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ అధికారుల ఈ–క్రాప్ శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ–పంట నమోదు అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. పంటల పూర్తి వివరాలతో నమోదు చేసి రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతు భరోసా కేంద్రాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకులు పూర్తి అవగాహనతో రైతులకు సూచనలివ్వాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

పల్లెల్లో ఆరోగ్య భాగ్యం

వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్ సక్సెస్

ఆరోగ్యమే మహాభాగ్యం.. ప్రతి పేదవాడికీ వైద్యాన్ని చేరువ చేయడమే ప్రభుత్వ లక్ష్యం.. వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు.. వైద్యాన్ని గ్రామసీమల దరికి చేర్చారు.. పల్లెకు పోదాం చలోచలో అంటూ వైద్యులను పల్లెబాట పట్టించారు. వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు, ఫ్యామిలీ ఫిజీషియన్ విధానాల ద్వారా స్థానికంగానే ఆరోగ్య పరీక్షలు, వైద్య సేవలందిస్తున్నారు. 14 రకాల ఆరోగ్య పరీక్షలను, 105 రకాల మందులను అందుబాటులోకి తీసుకువచ్చి పల్లె ప్రజలకు ఆరోగ్య భాగ్యాన్ని కల్పించారు.

- స్థానికంగానే వైద్య సేవలు
- జిల్లాలో 345 విలేజ్ క్లినిక్‌లు
- ఇప్పటివరకూ 3 లక్షలకు పైగా ఓపీ సేవలు



శ్రీరామపురం విలేజ్ క్లినిక్‌లో వైద్య సేవలు

భీమవరం (ప్రకాశం చౌక్) : ప్రజారోగ్యమే పరమావధిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. నాడు–నేడు కార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రులను ఆధునికీకరించడంతో పాటు అత్యాధునిక పరికరాలు, వసతులు కల్పిస్తున్నారు. వైద్యులు, సిబ్బంది నియామకాలు చేపట్టారు. మరో ముందడుగు వేసి పల్లె ప్రజలకు వైద్యాన్ని దరి చేర్చేలా వైఎస్సార్ విలేజ్ క్లినిక్, ఫ్యామిలీ ఫిజీషియన్ విధానాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. గ్రామీణులకు స్థానికంగా వైద్య సేవలందించేలా వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను ఏర్పాటుచేశారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది ఇక్కడ సేవలందించడంతో పల్లెవాసులకు సుస్తీ చేస్తే పట్టణాల బాట పట్టాల్సిన అవసరం తప్పింది. గతంలో చిన్నపాటి వైద్యానికి పరుగులు తీయాల్సి వచ్చేది. ఇప్పుడు గ్రామంలోనే ఉచితంగా వైద్య సేవలందడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. అలాగే ప్రభుత్వం ఏర్పాటుచేసిన విలేజ్ క్లినిక్‌లు విజయవంతంగా నడుస్తున్నాయి.



ఉచితంగా పరీక్షలు

విలేజ్ క్లినిక్‌లో 14 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తున్నారు. రక్తశాతం, ప్రెగ్నెన్సీ, మూత్ర పరీక్షలు, షుగర్, మలేరియా, హెచ్ఐవీ, డెంగీ, గర్భాశయ, హెపటైటిస్–బి, బోధకాలు, సుఖ వ్యాధులు, టీబీ, తాగునీటి పరీక్షలు, ఉప్పు పరీక్షలు తదితర 14 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు. 105 రకాల మందులను ఉచితంగా అందిస్తున్నారు. షుగర్, బీపీ, థైరాయిడ్, టీబీ, కామెర్లు, ఫిట్స్, ఎముకలు, కంటి, దంత, చెవి, చర్మ, జ్వరాలు తదితర వ్యాధులకు సంబంధించి మందులు అందిస్తున్నారు. అలాగే రోజుకు ఒక్కో క్లినిక్‌లో 10 మందికి ఆరోగ్య పరీక్షలు, 12 టెలీ కన్సల్టెన్సీ సేవలు అందిస్తున్నారు. సాధారణ రోగాలతో పాటు దీర్ఘకాలిక రోగగ్రస్తులకు కూడా ఇక్కడ వైద్య సేవలందిస్తున్నారు.

దూరాభారం లేకుండా..

బి.కమలావతి, కొండేపూడి



ఈ చిత్రంలో కనిపిస్తున్న వృద్ధురాలి పేరు బి.కమలావతి. పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు మండలం కొండేపూడి గ్రామం. గ్రామంలోని విలేజ్ క్లినిక్ ద్వారా బీపీ పరీక్షలు చేయించుకుని ఉచితంగా మాత్రలు అందుకుంటోంది. అలాగే కీళ్ల నొప్పులకు చికిత్స పొందుతోంది. గతంలో బీపీ పరీక్షలు, వైద్యం కోసం గ్రామం నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలోని నవుదూరు లేదా 12 కిలోమీటర్ల దూరంలోని భీమవరంలో ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సి వచ్చేది. అలాగే సొమ్ములు కూడా ఖర్చయ్యేవి. ఇప్పుడు దూరాభారం లేకుండా స్థానికంగానే ఉచితంగా పరీక్షలు చేసి మందులు అందించడం ఆనందంగా ఉందని ఆమె అంటున్నారు.



భీమవరం మండలం శ్రీరామపురంలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్



కాళ్ల మండలం జక్కరంలో వైద్య సేవలు అందిస్తున్న దృశ్యం

టెలీ కన్సల్టెన్సీ ద్వారా..

విలేజ్ క్లినిక్‌ల ద్వారా ఆయా గ్రామాల్లో గుండె, మెదడు సమస్యలు, తీవ్రమైన వ్యాధులతో బాధపడుతున్న వారికి టెలీ కన్సల్టెన్సీ సేవలందిస్తున్నారు. ఆయా విభాగాల వైద్య నిపుణులు నేరుగా రోగులతో మాట్లాడి సలహాలు, సూచనలు, మెరుగైన వైద్యం అందిస్తారు.

40 వేల వైద్య పరీక్షలు

పశ్చిమగోదావరి జిల్లాలో 2020 నుంచి ఇప్పటి వరకు 345 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా 3 లక్షల మందికి వైద్య సేవలు (ఓపీ) అందించారు.

నెలలో రెండుసార్లు..

ఉద్దరాజు దుర్గావతి



ఈ చిత్రంలో కనిపిస్తున్న వృద్ధురాలి పేరు ఉద్దరాజు దుర్గావతి. ఏలూరు జిల్లా దొడ్డిపట్ల గ్రామం. ఆమె వయసు 72 ఏళ్లు. మధుమేహం, రక్తపోటు సమస్యలతో బాధపడుతోంది. ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం వచ్చిన తర్వాత నెలలో రెండు సార్లు వైద్యులు గ్రామానికి వచ్చి ఆమెకు పరీక్షలు చేస్తున్నారు. ఉచితంగా మందులు కూడా అందిస్తున్నారు. గతంలో ఆమె ప్రతి నెలా వైద్య పరీక్షల కోసం పట్టణాలకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ అవస్థలు తప్పడం ఆమెకు ఎంతో ఊరటనిస్తోంది. గ్రామంలోనే వైఎస్సార్ విలేజ్ క్లినిక్ ద్వారా ఉచితంగా ఆరోగ్య సేవలందించడంపై ఆమె సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వైద్యులే ఇంటికి వచ్చి..

పుచ్చకాయల సరోజినీ



ఈ చిత్రంలో కనిపిస్తున్న వృద్ధురాలి పేరు పుచ్చకాయల సరోజినీ, ఏలూరు జిల్లా చాట్రాయి మండలం నరసింహరావుపాలెం గ్రామం. ఆమె 15 ఏళ్లుగా అధిక రక్తపోటు సమస్యతో బాధపడుతున్నారు. సత్తుపల్లి, విజయవాడ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకునేవారు. ప్రతినెలా అక్కడకు వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడంతో ఆమె వ్యయప్రయాసలకు గురయ్యేవారు. అయితే సీఎం జగన్ తీసుకుని ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ఇప్పుడు వైద్యులే ఆమె ఇంటికి వచ్చి ఉచితంగా ఆరోగ్య పరీక్షలు చేసి మందులు అందిస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం తనకెంతో మేలు చేస్తోందని ఆమె అంటున్నారు.

అలాగే 40 వేల వైద్యపరీక్షలు, 10 వేల టెలీ కన్సల్టెన్సీ సేవలు అందించారు. 345 విలేజ్ క్లినిక్‌లలో 345 మంది ఎంఎల్‌హెచ్‌పీలు, 345 మంది ఏఎన్ఎంలు నిత్యం అందుబాటులో ఉంటున్నారు.

రూ.46.90 కోట్లతో 276 భవనాలు

జిల్లాలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లకు శాశ్వత భవనాల ఏర్పాటుకు ప్రభుత్వం సంకల్పించింది. రూ.46.90 కోట్లతో 276 భవనాల నిర్మాణం చేపట్టింది. ఇందులో 60 శాతం భవనాలు నిర్మాణం పూర్తి చేసుకుని ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు అందుబాటులోకి వచ్చాయి.

చెస్ విజేతలకు బహుమతులు



రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: పిల్లలు చదరంగంలో ప్రావీణ్యం సంపాదించడానికి పోటీలు దోహదపడతాయని డీఎస్పీ బి.శ్రీనాథ్ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా చెస్ అసోసియేషన్, అనసూయ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీ స్టేట్ ఫిడే ర్యాపిడ్–బ్లిట్జ్ చెస్ చాంపియన్‌షిప్–2023 బహుమతి ప్రదానోత్సవానికి ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు భీమవరంలో ఏర్పాటు చేయడం అభినందనీయమని అసోసియేషన్ నిర్వాహకులను, దాతలను అభినందించారు. రాష్ట్ర చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీవీ శర్మ, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ మాట్లాడుతూ ఈ పోటీల్లో రెండు విభాగాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వారు వచ్చే ఫిబ్రవరిలో పంజాబ్‌లో జరిగే జాతీయ పోటీల్లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ర్యాపిడ్ విభాగంలో చీదెళ్ల శార్వాణి (ఎన్టీఆర్ జిల్లా), అల్లూరి భాస్కరరత్న షణ్ముఖ (తూర్పుగోదావరి), బ్లిట్జ్ విభాగంలో మహేష్ కుమార్ (తూర్పుగోదావరి), డీఎస్ఎస్ యు సాత్విక్ (కోనసీమ) మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. విజేతలకు నగదు ప్రోత్సాహకంతో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. కొనకొళ్ల హరనాథ్, కొత్త శ్రీనివాస్, ప్రీతి రాజు, ఎస్.బీ మారావు, గమిని రవిపవన్‌కుమార్, తోట హరిబాబు, చీఫ్ ఆర్బిటర్ ఉదయ్‌కుమార్, అల్లు శ్రీనివాసు పాల్గొన్నారు.

సమన్వయంతో పంచాంగాల రూపకల్పన

పంచాంగ కర్తలకు డిప్యూటీ సీఎం కొట్టు సలహా




పంచాంగకర్తల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పంచాంగాల రూపకల్పనలో పంచాంగకర్తలు సమన్వయం చేసుకోవాలని, తిథులు, వారాలు, పండుగలు, ముహూర్తాల వంటి అంశాల్లో భిన్నవాదనలు తలెత్తకుండా పంచాంగాలు సిద్ధం చేయాలని ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ సూచించారు. ఆదివారం ఏలూరులోని హేలాపురి బ్రాహ్మణ సేవా సంఘం సమావేశ మందిరంలో నగరానికి చెందిన త్రిశక్తి జ్యోతిర్నిలయం సిద్ధాంతి వి.భరద్వాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ పంచాంగకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు మాట్లాడుతూ జ్యోతిష్యానికి సంస్కృతి, సంప్రదాయాల్లో అత్యంత ప్రాధాన్యముందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి హిందూ మతంపై ఉన్న అచెంచల విశ్వాసంతో రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి నడుం బిగించామన్నారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు దేవదాయ శాఖను అత్యంత నిజాయితీగా నడిపిస్తున్నామన్నారు. ధార్మిక కార్యక్రమాల నిర్వహణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని చెప్పారు. ధార్మిక పరిషత్ సభ్యులను, ఆగమ పండితులను సమన్వయం చేసుకుంటూ రాష్ట్రంలో మహాయజ్ఞాలు నిర్వహించడానికి కృషి చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి సంకల్పమే రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తోందన్నారు. కొందరు హిందూ ఆలయాలపై దాడులు చేసి ధ్వంసం చేయడం వంటి చర్యలు కేవలం రాజకీయ లబ్ధి కోసమే చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల్లో పంచాంగకర్తలకు ప్రత్యేక దర్శనాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటామని మంత్రి కొట్టు హామీ ఇచ్చారు.

కార్యాలయ నిర్మాణానికి స్థలం

దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ పంచాంగకర్తల సమాఖ్య కార్యాలయ నిర్మాణానికి స్థలం కేటాయించడానికి ప్రభుత్వంతో సంప్రదిస్తామని హామీ ఇచ్చారు. అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎస్.చంద్రశేఖర్ ఆజాద్ మాట్లాడుతూ ఈసారి పంచాంగకర్తల సమ్మేళనం అన్నవరంలో నిర్వహిస్తే తగు ఏర్పాట్లు చేస్తామన్నారు. అనంతరం ప్రముఖ పంచాంగకర్తలు పీసపాటి పాలశంకర వరప్రసాద్ సిద్ధాంతి యజ్ఞ, కర్ణాటకలోని హంపి విరూపాక్ష విద్యారణ్య మహా సంస్థానం ఆస్థాన సిద్ధాంతి కాశీభొట్ల వీరవెంకట నాగేశ్వర కృష్ణ ప్రసాద్ శాస్త్రి, పిడపర్తి పంచాంగకర్త పిడపర్తి వీరేశ్వరశాస్త్రిలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పంచాంగకర్తల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు బట్టే వీరభద్ర దైవజ్ఞ, కార్యదర్శి తెన్నేటి శ్రీనివాసశర్మ, కార్యదర్శి చింతా గోపీకృష్ణ శర్మ, వి.భరద్వాజ్ సిద్ధాంతి తదితరులు పాల్గొన్నారు.

ఆకలి మంట.. శునకానికి తంటా



ఆకలి బాధతో ప్లాస్టిక్ డబ్బాలో మూతి పెట్టి తల ఇరుక్కుపోవడంతో శునకం ఇబ్బంది పడింది. ఆదివారం కుక్కునూరులో తిరుగుతున్న ఓ శునకం ప్లాస్టిక్ డబ్బాలో ఆహారం కోసం మూతి పెట్టింది. అయితే దాని తల డబ్బాలో చిక్కుకుపోయింది. స్థానికులు గమనించి డబ్బాను తీసేందుకు ప్రయత్నించగా అది వారికి దొరక్కుండా సమీపంలోని అడవిలోకి పారిపోయింది.

– కుక్కునూరు

తగ్గినట్టే తగ్గి.. పెరిగిన గోదావరి

యలమంచిలి : మండలంలోని కనకాయలంక కాజ్‌వే వద్ద గోదావరి వరద తగ్గినట్టే తగ్గి.. మళ్లీ పెరిగింది. ప్రస్తుతం కాజ్‌వే మీద వరద నీరు నిలకడగా ప్రవహిస్తోంది. గోదావరిలో ఆదివారం ఉదయం వరద ఉధృతి తగ్గడంతో కాజ్‌వే పిల్లర్స్ పాక్షికంగా బయటపడ్డాయి. అయితే మధ్యాహ్నానికి వరద మరింత పెరిగింది. ప్రస్తుతం కాజ్‌వే పైన సుమారు నాలుగున్నర అడుగుల మేర వరద నీరు ప్రవహిస్తోంది. గ్రామస్తులు ప్రభుత్వం ఏర్పాటుచేసిన మూడు ఇంజన్ పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. ప్రస్తుతం కాజ్‌వే ప్రాంతంలో మాత్రమే వరద ఉంది. భద్రాచలం, ధవళేశ్వరం వద్ద గోదావరిలో నీటిమట్టం పెరుగుతుందని వార్తల నేపథ్యంలో సోమవారం కనకాయలంకలోని పల్లపు ప్రాంతాలకు వరద చేరే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఆ పరిస్థితి ఏర్పడితే సహాయక చర్యలు చేపట్టడానికి, అవసరమైతే పునరావాస కేంద్రాలు ప్రారంభించడానికి చర్యలు తీసుకున్నట్లు తహసీల్దార్ మాతా సునీల్‌కుమార్ తెలిపారు. గ్రామంలో వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి. సర్పంచ్ మద్దా శ్రీనివాసరావు, వీఆర్వో సరెళ్ల లక్ష్మి సహాయక ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

నరసాపురంలో పరవళ్లు తొక్కుతూ..

నరసాపురం రూరల్ : నరసాపురంలో వశిష్ఠ గోదావరికి వరద గంట గంటకూ పెరుగుతోంది. రెవెన్యూ, పోలీసు యంత్రాంగం ఏటిగట్ల సంరక్షణకు గస్తీ కాస్తున్నారు. వరద పెరగడంతో మత్స్యకారులు ఐదు తూముల వద్ద నత్తలావా కాలువలో పడవలకు లంగరు వేశారు. వరద తాకిడికి గోదావరి మధ్యలో మత్స్యకారులు ఏర్పాటు చేసుకున్న వలకట్లు కొట్టుకుపోయాయి. నరసాపురంలోని ఐదు తూముల వద్ద నుంచి పొన్నపల్లి వరకు గోదావరి పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోంది. అమరేశ్వరస్వామి ఆలయం, పంటురేవు ప్రాంతాల్లో మెట్లపైకి నీరు చేరింది. పడవల రేవు, వలంధరరేవు, కొండాలమ్మ గుడి, శ్మశానవాటిక ప్రాంతాల్లో కూడా గోదావరి నీటిమట్టం పెరుగుతోంది. అలాగే మండలంలోని లక్ష్మణేశ్వరం, దర్భరేవు, రాజుల్లంక, మర్రితిప్ప, బియ్యపుతిప్ప ప్రాంతాల్లో వరద ఉధృతి కనిపిస్తోంది. సముద్రపు పోటు సమయంలో కూడా వరద పరిస్థితి మరింత ఉగ్రంగానే దర్శనమిస్తోంది.



యలమంచిలి : కనకాయలంలో కాజ్‌వే వద్ద ఉధృతంగా గోదావరి



పడవపై కాజ్‌వే దాటుతున్న గ్రామస్తులు



నరసాపురం రూరల్ : వలంధర రేవులో..

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి



కలపర్రు టోల్ గేట్ వద్ద డివైడర్‌ను ఢీకొన్న కారు.. చిత్రంలో మృతులు

పెదపాడు: కారు డివైడర్‌ను ఢీకొనడంతో రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన సంఘటన పెదపాడు మండలంలోని కలపర్రు టోల్‌గేట్ వద్ద చోటుచేసుకుంది. పెదపాడు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ఏలూరుకు చెందిన గండికోట శారద(62), కుమార్తె సన్నిధానం కామేశ్వరి, గరిమెళ్ల లలితలు గుడివాడకు బయలు దేరారు. వీరు ముగ్గురు మారుతీ ఆల్టో కారులో వెళ్తుండగా కలపర్రు టోల్‌గేట్ వద్దకు వచ్చేసరికి 4, 5 లైన్ల మధ్య ఉన్న డివైడర్ దిమ్మెను బలంగా ఢీకొట్టడంతో ముందుసీటులో కూర్చున్న గండికోట శారద, చొదిమెళ్లలో ఉంటున్న కారు డ్రైవర్ శ్రీనివాస్ సంఘటన స్థలంలోనే మృతి చెందారు. సన్నిధానం కామేశ్వరికి రెండుకాళ్లు విరిగిపోగా.. గరిమెళ్ల లలితకు ఎడమకాలు విరిగింది. వెంటనే క్షతగాత్రులను పోలీసులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు పెదపాడు ఎస్సై కృష్ణ చల్లా తెలిపారు.

కోడి వ్యర్థాలను తరలిస్తున్న వ్యాన్ స్వాధీనం



కోడి వ్యర్థాలను పూడ్చుతున్న దృశ్యం

భీమడోలు: చేపలకు మేతగా కోడి వ్యర్థాలను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు సీజ్ చేశారు. ఇద్దరి వ్యక్తులను భీమడోలు పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. వ్యాన్ యాజమాని, డ్రైవర్‌తో పాటు రెండు టన్నుల కోడి వ్యర్థాలను పట్టుకున్నారు. నిడమర్రు మండలం తోకలపల్లికి చెందిన జల్లూరి వెంకట రమణ తనకు చెందిన మినీ వ్యాన్‌పై డ్రైవర్ భలే సూర్యనారాయణతో కలిసి కోడి వ్యర్థాలను కొల్లేరు ప్రాంతం తరలిస్తుండగా సీజ్ చేశారు. ఎస్సై సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. వ్యాన్‌లో ఆ కోడి వ్యర్థాలను శివారు ప్రాంతాలకు తీసుకుని వెళ్లి గోతుల్లో పూడ్చారు.

ఆదమరిస్తే..కాలనాగులు కాటేస్తాయ్!

- వర్షాకాలంలో పాముల బెడద
- పొలాల్లో పొంచి ఉన్న ప్రమాదాలు

బుట్టాయగూడెం: వర్షాకాలంలో పాములు ఎక్కువగా కనిపిస్తుంటాయి. ముఖ్యంగా అటవీ ప్రాంతంలోని సరిహద్దు గ్రామాల్లో, దట్టమైన పొదల సమీపంలో పాములు తరచూ సంచరిస్తుండటం సాధారణమే. అయితే ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా పాముకాటుకు గురికాక తప్పదు. గత వారం రోజుల్లో పోలవరం నియోజకవర్గంలోని వేలేరుపాడు, కుక్కునూరు, పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లోని ప్రభుత్వాస్పత్రుల్లో పాము కాటు కేసులు ఎక్కువగా నమోదవుతుండటంపై ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అదేవిధంగా మండ్రకప్ప, తేలు కాటుకు గురై పలువురు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఏటా జూన్ నుంచి సెప్టెంబర్ వరకూ పాములు, ఇతర విష కీటకాల బెడద ఉంటుంది. వీటి బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

అన్ని పాములు ప్రమాదకరం కాదు

మనకు కనిపించే అన్ని పాములు విషపూరితం కాదని వైద్య నిపుణులు అంటున్నారు. నాగుపాము, కట్లపాము, రక్తపింజర వంటి పాముల వల్లే ప్రమాదం ఉందని చెబుతున్నారు. సాధారణంగా 50 శాతంపైగా పాముల వల్ల ఎలాంటి ప్రమాదం ఉండదని వైద్యులు అంటున్నారు. పాము కాటేసిన వెంటనే వైద్యం చేయించుకుంటే ఎలాంటి సమస్య ఉండదు



ప్రమాద కరమైన త్రాచుపాము

రక్తపింజర



ఎక్కువగా అటవీప్రాంతంలో తిరుగుతుంది. ఈ పాము కాటు వేస్తే 2 గంటల తర్వాత విషం శరీరానికి ఎక్కుతుందని చెబుతున్నారు. రక్తపింజర కాటువేసిన వెంటనే అందుబాటులో ఉన్న ప్రాథమిక ఆస్పత్రులకు వెళ్లి వైద్యం పొందాలి.

నాగుపాము

నాగుపాము అత్యంత ప్రమాదకరమైంది. ఈ పాము కాటువేస్తే 15 నిమిషాల్లో విషం ఎక్కుతుందని అంటారు. ముందుగా పాముకాటు వేసిన చోట వెంటనే కట్టు కట్టాలి. తదుపరి పాము కాటుకు గురైన వ్యక్తిని ఆస్పత్రికి తరలించాలి. నాగుపాము విషం ప్రధానంగా నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

కట్లపాము



కట్లపాము కాటువేసిన వెంటనే విషం రక్తంలో కలుస్తుంది. ప్రాణాపాయం ఎక్కువ. పాము కాటు వేసిన వెంటనే ఆస్పత్రిలో చేర్పించి వైద్యం చేయించాలి. కట్లపాము విషం రక్తంలోకి చేరకముందే వైద్యం చేయిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశం ఉంది.

ఈ జాగ్రత్తలు పాటించాలి

- పాముకాటుకు గురైన వారు ఎలాంటి ఆందోళన చెందకూడదు. తీవ్రమైన ఒత్తిడికి గురైతే గుండెపోటు వచ్చే ప్రమాదం ఉంది.
- పాము కాటువేయగానే గాయాల పైభాగంలో కట్టుకట్టాలి.
- ఏ పాము కాటు వేసిందో తెలుసుకొని యాంటీ వీనమ్(విషానికి విరుగుడు) తీసుకుంటే ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చు.
- రైతులు రాత్రిపూట పొలాలకు వెళ్ళేప్పుడు కాళ్ళకు చెప్పులు, టార్చిలైట్లతో పాటు శబ్దాలు చేసే పరికరాన్ని వెంట తీసుకుని వెళ్ళడం వల్ల పాము కాటు నుంచి రక్షించుకోవచ్చు.

అప్రమత్తంగా ఉండాలి



పాము నుంచి రక్షించుకునేందుకు అప్రమత్తంగా ఉండాలి. పాముకాటుకు గురైతే యాంటి వీనమ్ మందులు అన్ని ప్రాథమిక కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయి. కాటుకు గురైన వ్యక్తి శరీరంలో మార్పులు రాకుండా తగు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ ప్రవీణ్, పీహెచ్‌సీ వైద్యాధికారి, దొరమామిడి, బుట్టాయగూడెం మండలం

మంగమ్మ గుడికి పోటెత్తిన భక్తులు



గుబ్బల మంగమ్మ గుడికి బోనాలు సమర్పించేందుకు వెళ్తున్న కామవరం గిరిజనులు

బుట్టాయగూడెం: మండలంలోని కామవరం సమీపంలో ఉన్న అటవీప్రాంతంలో కొలువై భక్తుల పూజలందుకుంటున్న గుబ్బల మంగమ్మ తల్లి గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వాతావరణం మబ్బులతో ఉన్నప్పటికీ కొద్దిపాటి చిరుజల్లులే కురవడంతో అమ్మవారి దర్శనానికి ఆలయ కమిటీ వారు భక్తులను అనుమతించారు. దీనితో పెద్ద ఎత్తున భక్తులు తెల్లవారుజాము నుంచి గుబ్బల మంగమ్మగుడికి తరలివచ్చి మంగమ్మతల్లిని దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. బుట్టాయగూడెం మండలం కామవరానికి చెందిన పుల్లారావు ఆధ్వర్యంలో గిరిజనులు పెద్ద ఎత్తున బోనాలు ఎత్తుకుని డప్పు వాయిద్యాలతో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని బోనాలు సమర్పించి అమ్మవారికి పూజలు చేశారు.

శ్రీవారి కట్న కానుకలు ఇక సురక్షితం

భక్తులకు కంప్యూటరైజ్డ్ టికెట్లు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్య కల్యాణంలో స్వామి, అమ్మవార్లకు భక్తులు సమర్పించే కట్నకానుకలు ఇటీవల పక్కదారి పట్టిన విషయం తెలిసిందే. దీనిపై పూర్తిస్థాయి విచారణ చేపట్టిన అధికారులు, స్వామి, అమ్మవార్ల కట్నకానులను సైతం సంరక్షించేందుకు చర్యలు చేపట్టారు. మాన్యువల్ టికెట్లకు బదులుగా కంప్యూటరైజ్డ్ టికెట్లను భక్తులకు ఆదివారం నుంచి అందిస్తున్నారు. వివరాల్లోకి వెళితే. చినవెంకన్నకు ప్రతి రోజూ నిర్వహించే నిత్య కల్యాణంలో వందలాది మంది భక్తులు పాల్గొంటారు. అందులో అధిక శాతం మంది భక్తులు కల్యాణం ముగిసిన తరువాత స్వామి, అమ్మవార్లకు కట్న కానుకలను సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. అలా కట్న కానుకలు అందించిన భక్తులకు అక్కడున్న సిబ్బంది మాన్యువల్ పద్ధతిలో రసీదులను అందించేవారు. అయితే రసీదుల్లో రాసిన నగదు పూర్తిగా దేవస్థానానికి జమకాలేదని, కొంత సొమ్ము పక్కదారి పట్టిందని గుర్తించిన అధికారులు దీనిపై విచారణ చేపట్టారు. అందులో భాగంగా విచారణాధికారి, ఏఈఓ పి.నటరాజారావు ఇచ్చిన నివేదిక ప్రకారం నిత్యకల్యాణ మండపంలో 2022 జులై 9 నుంచి విధులు నిర్వర్తిస్తున్న రికార్డ్ అసిస్టెంట్ కె.హరిశ్చంద్ర ప్రసాద్ రికార్డుల ట్యాంపరింగ్‌కు పాల్పడ్డారని ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి, జూన్ 1 వరకు రికార్డులను పరిశీలించగా రూ. 21,912 తేడా కనిపించిందన్నారు. ఈ ఏడాది మార్చి 31 నుంచి అంతక ముందు రికార్డులను ప్రస్తుతం ఆడిట్ చేస్తున్నట్టు చెప్పారు. సదరు ఉద్యోగి రసీదులో రాసిన నగదు కంటే, తక్కువ నగదును లెడ్జర్ బుక్‌లో ఎంటర్ చేశాడు. సంబంధిత సూపరింటిండెంట్, ఏఈఓలు సైతం దాన్ని గమనించకుండా సంతకాలు చేస్తూ వచ్చారు. అసలు విషయం బయటపడటంతో వారు ఒక్కసారిగా కంగుతిన్నారు. ఇదిలా ఉంటే హరిశ్చంద్ర ప్రసాద్‌పై శాఖాపరమైన చర్యలతో పాటు, క్రిమినల్ చర్యలు చేపడతారా.. లేదా అన్నదానిపై ఆలయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.



శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో కట్నకానుకల టికెట్లను కంప్యూటర్‌లో ఎక్కిస్తున్న సిబ్బంది

మణిపూర్ అల్లర్ల కారకులను శిక్షించాలి

జంగారెడ్డిగూడెం: మణిపూర్ అల్లర్లకు కారణమైన దోషులను శిక్షించాలని జంగారెడ్డిగూడెం మండలం పాస్టర్స్ అసోసియేషన్, క్రైస్తవ సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం జంగారెడ్డిగూడెం పట్టణంలో జంగారెడ్డిగూడెం మండలం పాస్టర్ అసోసియేషన్, క్రిస్టియన్ సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీని నిర్వహించారు. టౌన్ హాల్ నుంచి ఏలూరు రోడ్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి, మణిపూర్ మారణ హోమానికి కారణమైన దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అలుగు ఆనంద శేఖర్ మాట్లాడుతూ అమాయక మహిళలపై దారుణాలు జరుగుతుంటే ప్రభుత్వం ఏం చేస్తుందని, అల్లర్లకు పాల్పడిన దోషులను శిక్షించాలని, రాజ్యాంగపరంగా తమకున్న విశేషాలు ఉపయోగించి మణిపూర్‌లో పరిస్థితిని చక్కదిద్దేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సుప్రీంకోర్టు న్యాయవాది నంబూరి శ్రీమన్నారాయణ మాట్లాడుతూ భారతదేశంలోని రాజకీయ పార్టీలన్నీ బీజేపీ మతోన్మాద పాలనను ఖండించాలని అప్పుడే భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి వీలవుతుందని తెలిపారు. పాస్టర్ పాల్‌సన్, పాస్టర్ నాడీ మాట్లాడుతూ తక్షణమే రాష్ట్రపతి జోక్యం చేసుకొని మణిపూర్ మారణకాండను ఆపాలని, కారకులను శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో శ్యాంబాబు, మల్లవరపు సత్యనారాయణ, మాస్టర్ ఆలీ, ముస్తఫా, జొన్నకూటి వెంకటేశ్వరరావు, అడ్వకేట్ గుమళ్ళ మణికుమార్, గంటా రామారావు, ఎల్ఆర్ కృష్ణ బాబు, పాస్టర్స్ మీమల్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మణిపూర్ రాష్ట్రంలోని దమన కాండను వెంటనే అదుపు చేయాలని, ఆ రాష్ట్రంలో శాంతిని నెలకొల్పాలని ఐసీయం సంఘాల అగ్ర పీఠాధిపతి, ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ ఆఫ్ చర్చ్‌స్ అధ్యక్షుడు బిషప్ జాన్ ఎస్‌డీ రాజు ఒక ప్రకటనలో డిమాండు చేశారు. అది కేవలం రెండు జాతుల మధ్య వైరంగా ప్రభుత్వాలు అభివర్ణిస్తున్నా, మతోన్మాద ఉగ్రవాదుల దాష్టీకం అన్నారు. క్రైస్తవులను, పాస్టర్లను, వారి దేవాలయాలను, వాటి ఆస్తులనే లక్ష్యంగా చేసుకొని జరిగిన విధ్వంసం అందుకు నిలువెత్తు నిదర్శనం అన్నారు. మనుషుల్ని చంపుకోవడం సమస్యలకు పరిష్కారం కాదని మతం వేరు, మతోన్మాదం వేరని మతం మనిషిని మనిషిగా ఉంచడానికి ప్రయత్నిస్తుంది గానీ మతోన్మాదం మనిషిని రాక్షసుడ్ని చేస్తుందన్నారు. ఈ దమన కాండ వెనుక వున్న వారి మూలాల్ని పట్టుకొని శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల వర్షం

ఏలూరు(మెట్రో): జిల్లాలో వర్షాలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూనే ఉన్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆదివారం పలుచోట్ల వర్షం కురిసింది. గోదావరి పరీవాహక ప్రాంతాలు ఇంకా జలదిగ్బంధంలోనే ఉన్నాయి. గత 24 గంటల్లో పశ్చిమ గోదావరి జిల్లాలో 13.1 మి.మి వర్షపాతం నమోదు కాగా, అత్యధికంగా పాలకొల్లు మండలంలో 40 మి.మి, కాళ్ల మండలంలో 35.2 మి.మి, భీమవరం మండలంలో 20.6 మి.మి వర్షపాతం నమోదైంది. అదేవిధంగా ఏలూరు జిల్లాలో 18.3 మి.మి వర్షపాతం నమోదు కాగా, అత్యధికంగా ముదినేపల్లిలో 54.2 మి.మి. కైకలూరులో 46.2 మి.మి, కలిదిండిలో 42.6 మి.మి వర్షపాతం నమోదైంది. మరో రెండు మూడు రోజులు ఇదే పరిస్థితి కొనసాగుతుందని వాతావరణ శాఖాధికారులు చెబుతున్నారు.

చంద్రబాబు ఉచ్చులో పవన్ కల్యాణ్

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: పరిపాలనలో ప్రధాన భూమిక వహిస్తున్న వలంటీర్ల వ్యవస్థ అంటే ప్రతిపక్షాలకు తీవ్ర భయం పట్టుకుందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పెంటపాడులో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు పన్నిన ఉచ్చులో పవన్ చిక్కుకున్నాడని, తన గొయ్యి తానే తవ్వుకుంటున్నాడన్నారు. సీఎం జగనన్న ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థ ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో క్రియాశీలక పాత్ర పోషిస్తుందన్నారు. వలంటీర్ల సేవలు పొందుతున్న ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. ఈ వ్యవస్థ ఇలానే కొనసాగితే ఇక తమకు రాజకీయ మనుగడ ఉండదని ప్రతిపక్షాలకు భయం పట్టుకుందన్నారు. వలంటీర్ల వ్యవస్థ వల్ల ప్రతిపక్షాల వెన్నులో వణుకు పడుతోందన్నారు. ఏదోలా లేనిపోని అభాండాలు వేసి ఆ వ్యవస్థను చిన్నాభిన్నం చేయాలనే కుట్ర పన్నుతున్నారన్నారు. దీనికోసం పవన్ కల్యాణ్‌ను పావుగా చంద్రబాబు వాడుకుంటున్నాడని డిప్యూటీ సీఎం విమర్శించారు. సీఎం అమలు చేస్తున్న విధానాలు పొరుగు రాష్ట్రాల్లో అమలు చేయడం గమనించిన ప్రధాని నరేంద్రమోదీ కూడా కేంద్రం నుంచి ఒక ప్రతినిధి బృందాన్ని రాష్ట్రానికి పంపి అధ్యయనం చేయిస్తున్నారన్నారు. చంద్రబాబు వ్యక్తిగ స్వార్థంతో దుష్టపన్నాగం పన్నుతున్నాడని ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేపట్టాడని ధ్వజమెత్తారు. అలర్లు సృష్టించి ప్రభుత్వాన్ని అస్థిర పరచాలని కుట్రలు పన్నుతున్నారన్నారు. పవన్‌కు దమ్ముంటే రాష్ట్రంలో ఏదో ఒక క్లస్టర్‌లో ఇంటికి వచ్చి వలంటీర్ల వ్యవస్థపై ప్రజల అభిప్రాయం సేకరించాలని సవాల్ విసిరారు. చంద్రబాబు స్క్రిప్ట్ చదవడం మాని క్షేత్రస్థాయికి వచ్చి వాస్తవాలు తెలుసుకోవాలన్నారు. వలంటీర్ల వ్యవస్థతో పెట్టుకొని రాజకీయంగా తన గొయ్యి తనే తవ్వుకుంటున్నాడని హెచ్చరించారు.



పెంటపాడులో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

● గడపగడపకు సంక్షేమం



పెంటపాడు: పెంటపాడులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పథకాలు వివరిస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

రైలు నుంచి జారి వ్యక్తి మృతి

తణుకు: తణుకు రైల్వే అవుట్ పోలీసు స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి రైలు నుంచి జారి పడి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మంచిలి రైల్వే స్టేషన్ సమీపంలో సుమారు 45 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తి రైలు పట్టాలపై మృతి చెందిన విషయాన్ని గుర్తించిన పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడు నల్లని ఫ్యాంట్ ధరించి, కుడిచేతిపై జీ అనే ఇంగ్లీషు అక్షరం పచ్చబొట్టు ఉన్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 95738 91737 నెంబర్‌కు తెలియజేయాలని కోరారు.

రైలు నుంచి జారి వ్యక్తికి గాయాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రైలులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తూ రైలు నుంచి ఒక వ్యక్తి జారిపడిన సంఘటన ఆదివారం ఏలూరు రైల్వే స్టేషన్‌లో జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలను రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ ఆదినారాయణ పత్రికలకు విడుదల చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పల్నాడు జిల్లా చిలకూరిపేట మండలం మురుగుపూడి గ్రామానికి చెందిన గునుగుపాటి పాపారావు విజయవాడ నుంచి శ్రీకాకుళం రోడ్డు వరకు జనరల్ రైలు టికెట్ తీసుకుని ఈస్ట్‌కోస్ట్ రైలులో ఏసీ బోగీలో ఎక్కి ప్రయాణం చేస్తున్నాడు. రైలు ఏలూరుకు చేరుకోగా బోగీ గేటు వద్ద నుంచున్న పాపారావు బండి నుంచి జారి 2వ నెంబర్ ప్లాట్‌ఫాంపై పడి స్పృహ కోల్పోయాడు. ఇది గమనించిన రైల్వే పోలీసులు అతని బంధువులకు సమాచారం ఇచ్చాడు. 108 అంబులెన్స్ ద్వారా ఏలూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి పాపారావును చికిత్స నిమిత్తం తరలించమన్నారు. ప్రస్తుతం పాపారావు ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని హెడ్ కానిస్టేబుల్ ఆదినారాయణ తెలిపారు.



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

క్షేత్రంలో సౌకర్యాల పరిశీలన

భక్తులను ఆరా తీసిన రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్

ద్వారకాతిరుమల: ఏమ్మా.. ఆలయంలో సౌకర్యాలు ఎలా ఉన్నాయ్.. స్వామివారి దర్శనం బాగా జరిగిందా.. అంటూ రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఆదివారం చినవెంకన్న భక్తులను ఆరా తీశారు. శనివారం రాత్రి క్షేత్రానికి విచ్చేసిన ఆయన ఆదివారం ఉదయం సైతం శ్రీవారిని, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఆలయ ఆవరణలో పలువురు భక్తులను పలకరించి, దేవస్థానం అందిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఆలయంలో అన్ని సౌకర్యాలు అందుతున్నాయా లేదా.. స్వామివారి దర్శనంలో ఏవైనా ఇబ్బందులున్నాయా.. అని భక్తులను స్వయంగా అడిగి తెలుసుకుని, వారు చెప్పిన సమాధానాలకు సంతృప్తి వ్యక్తం చేశారు. ఆ తరువాత ఆలయ పరిసరాలను, ప్రధాన కూడళ్లను సందర్శించారు. అందులో భాగంగా ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతంలో జరుగుతున్న క్యూ కాంప్లెక్స్ నిర్మాణ పనులను, శివాలయం కొండ వెనుక భాగాన నిర్మిస్తున్న సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను పరిశీలించారు. అనివేటి మండప విస్తరణకు సంబంధించిన ప్లాన్‌ను ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు, ఈఈ డీవీ భాస్కర్‌లు కమిషనర్‌కు వివరించారు. భవిష్యత్తులో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులను సైతం ఆయనకు వివరించారు.



గోశాలలో గోవుకు దాణా అందిస్తున్న దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



మృతుడు మేడ సుబ్బారావు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఆదివారం స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం నరసాపురం, పాలకొల్లు రహదారిలో పాత మోటర్ వెహికల్ కార్యాలయం రోడ్డు నుంచి బైక్‌పై వస్తున్న మేడ సుబ్బారావు (45)ను ఎదురుగా వస్తున్న ఎస్.రాజు ఢీకొట్టడంతో సుబ్బారావుకు తీవ్రగాయాలయ్యాయి. హుటాహుటిన స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సుబ్బారావు మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

కోడిపందేలు, పేకాట స్థావరాలపై దాడులు

చింతలపూడి: చింతలపూడి మండలంలోని పలు ప్రాంతాల్లో కోడిపందేలు, పేకాట స్థావరాలపై పోలీసులు ఆదివారం దాడులు జరిపారు. శంఖుచక్రపురం పరిధిలో కోడిపందేలపై దాడులు చేసి 11 మందిపై కేసులు నమోదు చేశారు. రూ.4,900 నగదు, కోడి పుంజు, 10 కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక సిటీ పబ్లిక్‌స్కూల్ వెనుక ఒక ఇంట్లో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని 1,800 నగదును స్వాధీనం చేసుకుని ఎస్ఐ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాలకోడేరు మండలంలో..

పాలకోడేరు: పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో దాడి చేసి నలుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. మోగల్లులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం అందడంతో ఎస్సై నాళం శ్రీనివాసరావు తన సిబ్బందితో ఆదివారం స్థావరంపై దాడి చేశారు. నలుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1100 నగదు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి భీమవరం కోర్టులో హాజరుపరుస్తామని ఎస్ఐ తెలిపారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

కుక్కునూరు : వరద ప్రభావిత గ్రామాలలో పారిశుధ్య నిర్వాహణతో పాటు దోమల నివారణ చర్యలు చేపట్టినట్టు జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కుక్కునూరు, వేలేరుపాడు వరద ప్రభావిత గ్రామాలలో 25 ఫాగింగ్ యంత్రాలను సిద్ధం చేశామన్నారు. స్థానికంగా ఉండే సిబ్బందే కాకుండా అదనంగా 200 మంది సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. వరద ప్రభావిత ప్రాంతాలలో ఉన్న 42 ఓహెచ్ఆర్ ట్యాంకులను శుభ్రం చేసి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి జిల్లా పంచాయతీ వింగ్ ద్వారా అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. ఆదివారం కుక్కునూరు మండలంలోని కుక్కునూరు, దాచారం, వింజరం, తొండిపాక, అమరవరం, గణపవరం, శ్రీధర, పెద్దరావిగూడెం తదితర పంచాయతీలలో బ్లీచింగ్ చల్లించామన్నారు. ముందస్తు చర్యలలో భాగంగా అదనంగా శానిటేషన్ మెటీరియల్ అన్ని ప్రాంతాలకు తరలించామన్నారు. పారిశుధ్య కార్మికుల త్యాగం మరవలేనిదని వారి సమర్థవంతమైన సేవలు, వైద్యశాఖ సహకారంతో వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు అనారోగ్యానికి గురికాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు.



ఫాగింగ్ పరికరాన్ని పరిశీలిస్తున్న డీపీఓ శ్రీనివాస విశ్వనాథ్

సీఎం జగనన్న పాలనలో సంతోషంగా ప్రజలు

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- పెంటపాడులో ముగిసిన గడపగడపకు మన ప్రభుత్వం


పెంటపాడులో ప్రజలకు పథకాలు వివరిస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమం పెంటపాడులో ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో నాలుగు రోజుల నుంచి నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ఆదివారం రాత్రితో గ్రామంలో ముగిసింది. ఈ సందర్భంగా గ్రామంలో పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించి ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు వివరించారు. సమస్యలు అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరచిన వాగ్దానాల్లో 99 శాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందన్నారు. లంచాలు, అవినీతి లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఇది చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు పలు కుట్రలు పన్నుతున్నాయన్నారు. ప్రజల అవసరాలు గుర్తించి వాటిని నెరవేర్చినప్పుడే ప్రజలు సంతోషిస్తారన్న సంగతిని చంద్రబాబు, పవన్ గుర్తుంచుకోవాలన్నారు. ప్రజలు సీఎం జగనన్న పాలనలో సంతోషంగా ఉన్నారన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు సత్యనారాయణకు గ్రామస్తుల నుంచి భారీ స్వాగతం లభించింది. గౌరీదేవి అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు మంత్రిని గజమాలతో ఘనంగా సన్మానించారు. పలువురు పూలమాలలు వేసి శాలువాలు కప్పి హారతులిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, అధికార ప్రతినిధి ముప్పిడి సంపత్‌కుమార్, సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి నల్లమిల్లి విజయానందరెడ్డి, దేవాబత్తుల బాబి నాగమణి, వెలగల శ్రీనివాసరెడ్డి(బస్సులరెడ్డి), నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, సొసైటీల అధ్యక్షుడు గుండుమోగుల సాంబయ్య, బూరాడ శ్రీను, కోరెడ్డి అబ్బాయి, కుంచే సుబ్రహ్మణ్యం, దేవ వెంకటరమణ, యూత్ అధ్యక్షుడు కొవ్వూరి భాస్కరరెడ్డి, రెడ్డి శ్రీను, మైలవరపు పెదబాబు, దేవ వెంకటరమణ, ఏఎంసీ వైస్ ఛైర్మన్ జామికృష్ణ, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్, రెడ్డి సూరిబాబు, పొట్ల ఏడుకొండలు, సైపురెడ్డి రాంబాబు, ములగాల బాబ్జి, బండారు గోపి, ఏవీఎస్, కైగాల గణపతి, బొమ్మినాయుడు, డోకల రాము, మిరియాల బాస్కరరావు, శేషు, మట్టా సత్యనారాయణ, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపదరావు కృష్ణారావు, పార్టీ నాయకులు బోణం వీరయ్య, సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు పెన్నాడ సూరిబాబు, తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీవో బాలాజీ, ఎంఈవో శ్రీనివాస్, పంచాయతీ రాజ్ ఏఈ నవీన్, పలు శాఖల ఏఈలు, సిబ్బందితో పాటు, గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పెంటపాడు అభివృద్ధికి వరాల జల్లు


పెంటపాడు వెలంపేట గౌరీదేవి ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మంత్రికి ఘనసన్మానం చేస్తున్న పెద్దలు

పెంటపాడు: గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమం పెంటపాడులో నాలుగురోజుల పాటు నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన పెంటపాడులోని ఆలయాల అభివృద్ధికి వరాలు జల్లు కురిపించారు. గ్రామ ఇలవేల్పు గౌరీదేవి అమ్మవారి ఆలయానికి రూ. కోటి నిధులు, వీరబ్రహ్మంగారి ఆలయానికి రూ.10 లక్షలు, అన్నపూర్ణమ్మ ఆలయం వద్ద నిర్మించనున్న మరో ఆలయానికి రూ.10 లక్షలు, వెలమ సంక్షేమ సంఘ భవనానికి వంట షెడ్డు నిమిత్తం రూ.10 లక్షలు, బాలవెంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి రూ.50 లక్షలు, దూప దీప నైవేద్యాల కింద మరో రెండు ఆలయాలకు నెలకు 5 వేల చొప్పున, మారెమ్మగుడి అభివృద్ధికి రూ.10 లక్షలు నిధులు అందించేందుకు మంత్రి హామీ ఇచ్చారు. దీంతో పాటు, మరెమ్మగుడి చుట్టూ ఉన్న ఇళ్లకు పొజిషన్ పత్రాలు, పెంటపాడు డంపింగ్ యార్డు వద్ద శ్మశానం అభివృద్ధి డంపింగ్ యార్డుకు దారి ఏర్పాటు, సుమారు రూ.50 లక్షలతో పెంటపాడులో పలు చోట్ల నూతనంగా చేపట్టబోయే డ్రైనేజీలకు రూ.50 లక్షల నిధులు, పెంటపాడులో తాగునీటి సమస్యలను తీర్చేందుకు రూ. 3 కోట్లతో జలజీవన్ పనులు, రూ. 25 లక్షలతో మైక్రో ఫిల్టర్ పనులు, మరో చెరువుకోసం ఎండోమెంట్ ద్వారా ఉన్న 5 ఎకరాల చెరువును లీజుకు తీసుకొని తాగు నీటి సమస్యలు పరిష్కరించేందుకు ఏర్పాట్లు తాగునీటి చెరువు నుంచి పూడుకు పోయిన అవుట్ లెట్ రైతులకు ఇబ్బందులు లేకుండా సమస్యలను పరిష్కరించేందుకు ఏర్పాటు ఇలా పలు పెండింగ్ పనులకు మంత్రి కొట్టు సత్యనారాయణ హామీలు ఇవ్వడంతో గ్రామస్తులు హర్షం తెలిపారు. సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, ఎంపీపీ దాసరి హైమావతి, ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్ రెడ్డి, యూత్ అధ్యక్షుడు భాస్కరరెడ్డి, అంజిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు దేవాబత్తుల బాబినాగమణి, రెడ్డి సూరిబాబు తదితరులు మంత్రికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

కష్ట కాలంలో విశేష సేవలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కరోనా కష్టకాలంలో పేదల జీవనం అస్తవ్యస్తంగా మారింది. అలాంటి తరుణంలో కరోనాను సైతం లెక్క చేయకుండా వలంటీర్ కె.హనుమాన్ ప్రసాద్ వార్డులోని వారికి ఇంటింటికీ వెళ్లి వైద్య పరంగా సహాయ సహకారాలు, ప్రభుత్వ పింఛను అందజేత, సంక్షేమ పథకాలు అమలులో చురుగ్గా పనిచేసి ప్రజల అభిమానాన్ని చూరగొన్నాడు. నేడు ప్రజలకు చేదోడువాదోడుగా ఉంటూ అనేక సేవలు అందిస్తున్నారు. అటువంటి వలంటీర్లకు ప్రజలు సలాం చేస్తున్నారు.

పథకాలపై అవగాహన కల్పిస్తున్న వలంటీర్లు



స్థానిక 34వ వార్డు హౌసింగ్‌బోర్డు కాలనీలో నేను నివాసం ఉంటున్నాను. మా వార్డు క్లస్టర్ వలంటీర్ కె.హనుమాన్ ప్రసాద్ వార్డు ప్రజలకు అనేక సేవలు అందిస్తున్నాడు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమాలపై అవగాహన కల్పించి అర్హులకు వాటిని అందజేస్తున్నాడు. మాకు పింఛను, చేయూత వంటి పథకాలు అమలవుతున్నాయి. చాలా సంతోషంగా ఉంది. వచ్చే ఎన్నికలలోనూ వైఎస్సార్ సీపీ విజయం ఖాయం.

– గుడ్ల విజయలక్ష్మి, గృహిణి, 34వ వార్డు,తాడేపల్లిగూడెం

నిస్వార్థంగా సేవలు



స్థానిక 34వ వార్డు హౌసింగ్‌బోర్డు కాలనీలో నేను నివాసం ఉంటున్నాను. మా వార్డు క్లస్టర్ వలంటీర్ కె.హనుమాన్ ప్రసాద్ వార్డు ప్రజలకు అనేక సేవలను అందిస్తున్నాడు. వార్డులో ఎప్పటికప్పుడు ఆరోగ్య సమాచారం, అమలు అవుతున్న ప్రభుత్వ సంక్షేమాలు, కొత్తగా వచ్చే సంక్షేమాలు, తదితర విషయాలను ఎప్పటికప్పుడు తమకు వలంటీర్ తెలియజేస్తున్నాడు. నిస్వార్థంగా వారు సేవలందించడం అభినందనీయం. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక పరిపాలన అందిస్తున్నారు.

– వాసాబత్తుల వెంకటేశ్వర్లు, సీనియర్ సిటిజన్, 34వ వార్డు, తాడేపల్లిగూడెం

బిషప్ శ్యామ్‌సన్‌కు సత్కారం

ఆకివీడు: ప్రేమతత్వాన్ని పలువురికి పంచడమే బైబిల్ సారాంశమని క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్, బైబిల్ మిషన్ చైర్మన్ మేడిది జాన్‌సన్ అన్నారు. చెరుకుమిల్లిలోని సీఎస్ఐ చర్చిలో బిషప్ ఎరిచర్ల శ్యామ్‌సన్ సత్కార సభ ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జాన్‌సన్ మాట్లాడుతూ తల్లిదండ్రులపై ఎనలేని ప్రేమ చూపాలన్నారు. సమాజంలో అందరూ దేవుని బిడ్డలేనన్నారు. బైబిల్ సన్మార్గం చూపుతుందన్నారు. బిషప్ శ్యామ్‌సన్ చిన్నప్పటి జ్ఞాపకాల్ని జాన్‌సన్ సభకు తెలియజేశారు. సన్మాన గ్రహీత బిషప్ శ్యామ్‌సన్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు మనుషుల్ని సన్మార్గం వైపు మళ్లిస్తాడన్నారు. సీఎస్ఐ కౌన్సిల్ సభ్యుడు ఎరిచర్ల సాంబర్లిన్ ఆధ్వర్యంలో బిషప్ శ్యామ్‌సన్, మేడిది జాన్‌సన్‌లను ఘనంగా సత్కరించారు. స్త్రీల సంఘం, సంఘ పెద్దలు దుశ్శాలువాలతో వారిని సత్కరించారు. సర్పంచ్ నందమూరి ప్రకాశం, పాస్టర్ జయపూర్ణ, సంఘ పెద్దలు ఎరిచర్ల పుష్పరాజ్, ప్రసాద్, స్థానికులు ఎరిచర్ల గ్లాడ్‌సన్, బిరుదుగడ్డ రమేష్, జానీ తదితరులు పాల్గొన్నారు. దాతల సహకారంతో పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

మానవత కమిటీలకు అవగాహన


సదస్సులో మాట్లాడుతున్న రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ రాధా పుష్పావతి

తణుకు టౌన్: మానవత సంస్థ సేవలను విస్తరణ, పటిష్టం చేసేందుకు సభ్యులు సమన్వయంతో పని చేయాలని మానవత సంస్థ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కోడూరి రాధా పుష్పావతి చెప్పారు. ఆదివారం తణుకులోని గమిని ఫంక్షన్ హాలులో నిర్వహించిన 5, 7,8 రీజియన్‌లలోని మండలాలకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారులకు నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఉమ్మడి జిల్లా కమిటీ, జిల్లా నియంత్రణకమిటీ సంయుక్తంగా నిర్వహించిన ఈ సమావేశంలో 15 మండలాలకు చెందిన మండల కమిటీల బాద్యులు పాల్గొన్నారు. ఈసమావేశానికి జిల్లా అధ్యక్షుడు రామిశెట్టి గంగాధరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాధాపుష్పావతి మాట్లాడుతూ మానవత సంస్థ సభ్యులు మారుతున్న సాంకేతికతను ఉపయోగించుకుని సేవా కార్యక్రమాలు మరింతగా విస్తరింపజేయాలన్నారు. కమిటీలు తమ కార్యకలాపాలకు సంబంధించిన వివరాలను, బ్యాంక్ ఖాతాల నిర్వహణ, జమా ఖర్చుల ఆడిట్ వంటి అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కేంద్ర నియంత్రణ కమిటీ చైర్మన్ గమిని రాంబాబు మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో శాంతి ర్యాలీ అవసరం చాలా వుందని, ప్రపంచ శాంతి కోసం శాంతి ర్యాలీలు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా నిర్వహించాలని కోరా రు. రాష్ట్ర కన్వీనర్ సాగిరాజు జానకిరామ రాజు మాట్లాడుతూ మానవత సభ్యుల మధ్య ఆత్మీయ సహకారం అవసరమని చెప్పారు. కష్ట సమయంలో వారికి సహాయం అందిస్తేనే మానవత్వమనేది సమాజంలో ఇంకా పెరుగుతుందని చెప్పారు. కేంద్ర నియంత్రణ కమిటీ శాశ్వత కమిటీ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు, అయినాల రమణమూర్తి, కె సూర్యనారాయణ, తాడేపల్లి మోహనరావు, బోయపాటి రామలక్ష్మీ పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన బ్రోచర్ల ఆవిష్కరణ


ఓటు హక్కు నమోదుపై బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్డీవో, డీఎస్పీ

భీమవరం (ప్రకాశంచౌక్): ఓటు హక్కు నమోదుపై పట్టణంలో స్వచ్ఛంద సంస్థలు రెవెన్యూ శాఖ సహకారంతో అవగాహన ప్రచార కార్యక్రమాల కోసం ముద్రించిన బ్రోచర్లను ఆర్డీవో దాసి రాజు, డీఎస్పీ శ్రీనాథ్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి పౌరుడు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని, ఇటువంటి ప్రభుత్వ కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములు కావడం అభినందనీయమని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు ఒక వజ్రాయుధం అని, నిర్లక్ష్యరాసుల్లో అవగాహన లేక ఓటును నమోదు చేసుకోలేకపోతున్నారని, ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నప్పుడే ప్రజాస్వామ్య వ్యవస్థ బలపడుతుందన్నారు. కొన్ని కొన్ని మారుమూల ప్రాంతాల్లో ఈ కార్యక్రమాలను భారత ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ప్రశాంతి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నామన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ భీమవరం ప్రాంతంలోని స్లమ్ ఏరియాలో పల్లె గ్రామాల్లో కూడా అవగాహన ప్రచార కార్యక్రమాలను రెవెన్యూ శాఖ సహకారంతో నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రచార కమిటీ సభ్యులు కంతేటి వెంకటరాజు, సీఐ కృష్ణకుమార్, ఎస్సై అప్పారావు పాల్గొన్నారు

మతోన్మాదుల నుంచి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి


తణుకులో కొవ్వొత్తుల ప్రదర్శనలో పాల్గొన్న నాయకులు

తణుకు: మణిపూర్‌లో మతోన్మాదుల నుంచి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ప్రజాసంఘాల నాయకులు, రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం రాత్రి తణుకులో నిర్వహించిన కొవ్వొత్తుల ప్రదర్శన కార్యక్రమంలో పలువురు వక్తలు పాల్గొని మాట్లాడారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పీవీ ప్రతాప్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకాల బాబూరావు, ఐలు జిల్లా కార్యదర్శి కామన మునిస్వామిలు మాట్లాడుతూ మణిపూర్‌లో మతోన్మాదులు చేస్తున్న దాడులను ఆపాలని, ప్రజలకు రక్షణ కల్పించలేని ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని, మహిళలపై దాడులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పి.దక్షిణామూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు గుబ్బల గోపి, ఎస్.ఆదినారాయణబాబు, గార రంగారావు, వల్లూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రాష్ట్ర అర్చక మహాసభను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న రాష్ట్ర వైష్ణవ సంఘం అధ్యక్షుడు కొడవటిగంటి వెంకట నరసింహాచార్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని బలుసులమ్మవారి కల్యాణ మండపంలో ఈ నెల 26న బుధవారం నిర్వహించనున్న రాష్ట్ర అర్చక మహాసభను విజయవంతం చేయాలని రాష్ట్ర వైష్ణవ సంఘం అధ్యక్షుడు కొడవటిగంటి వెంకట నరసింహాచార్యులు వెల్లడించారు. పట్టణంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్చకుల సమస్యలు, వాటిని పరిష్కరించేందుకు చేపట్టాల్సిన భవిష్యత్తు కార్యాచరణపై మహాసభలో చర్చిస్తారని తెలిపారు. అనంతరం మంత్రి కొట్టు సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తామని వెల్లడించారు. అర్చకులు హాజరు కావాలని కోరారు. సమావేశంలో దేవరపల్లి అర్చక ప్రతినిధి పి.రంగబాబు, గోవర్ధన్ విజయసారధి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కాళ్ల: బాస్విని చారిటబుల్ ట్రస్టు సేవలు అభినందనీయమని పలువురు పెద్దలు అన్నారు. దొడ్డనపూడిలో పొనమాడి సాయిబాబు ఇటీవల అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ కొల్లి సుబ్బారావు స్పందించి బాస్విని చారిటబుల్ ట్రస్టు తరుపున ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామపెద్దలు మాట్లాడుతూ గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న, వయస్సు పైబడిన సుమారు 35 మంది పేదలకు తన ట్రస్టు తరుపున ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున ప్రతి నెలా అందిస్తున్నామన్నారు. గ్రామ సమస్యలను పరిష్కరించటంతో పాటు పేద ప్రజలకు ఎన్నో సేవలందిస్తున్న సర్పంచ్ సుబ్బారావును అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నక్కా వీరకృష్ణ, కొల్లి సురేష్, పలువురు వార్డు సభ్యులు, ట్రస్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు స్పందన

ఉండి: ఉండిలోని మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ ఎస్వీఎస్ నాయుడు చెప్పారు. మండలంలోని 19 గ్రామాల ప్రజలు తమ సమస్యలపై స్పందన కార్యక్రమంలో అర్జీలు అందించవచ్చునని ఆయన తెలిపారు.

సిద్ధాంతంలో గోదావరి వరద తగ్గుముఖం

పెనుగొండ: గోదావరి పరవళ్ల ఉధృతి తగ్గుముఖం పట్టింది. సిద్ధాంతం వద్ద వశిష్టాగోదావరి నెమ్మదిగా తగ్గుతుంది. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రానికి శనివారం నాటికన్నా రెండు అడుగుల మేర నీటిమట్టం తగ్గింది. దీంతో మధ్యస్థ లంకల్లోకి రాకపోకలు యథావిధిగా కొనసాగిస్తున్నారు. ఆచంట మండలంలో పెదమల్లం, అయోధ్యలంక, భీమలాపురం వద్ద ఉధృతి నెమ్మదిగా ఉండడంతో లంక గ్రామాల్లో సాధారణ పరిస్థితులు నెలకొని ఉన్నాయి. గోదావరిలో వరద ఉధృతిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

బహిరంగ ప్రకటన

[illegible]

కనకాయలంకలో డీఎంహెచ్ఓ పర్యటన

యలమంచిలి: వరద ముంపునకు గురైన కనకాయలంక గ్రామంలో ఆదివారం డీఎంహెచ్ఓ డాక్టర్ మహేశ్వరరావు పర్యటించారు. శిబిరంలో అందుతున్న వైద్య సేవలను, అందుబాటులో ఉంచిన మందులను తనిఖీ చేశారు. గ్రామంలో జరుగుతున్న జ్వరం సర్వేను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు గోదావరి వరద కారణంగా ప్రజలు ఎవరూ రోగాల బారిన పడకుండా వైద్య ఆరోగ్య శాఖ ద్వారా సంపూర్ణ పారిశుద్ధ్య చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఒకవేళ ఎవరైన రోగాలబారిన పడినా వైద్య సహాయం చేసేందుకు కనకాయలంకలో ఒక ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, హెల్త్ అసిస్టెంట్, ఆశ కార్యకర్తలు మూడు షిఫ్టులలో 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నట్లు వివరించారు. పాము కాటుకు, కుక్క కాటుకు అవసరమైన ఇంజక్షన్లుతో పాటు, అన్ని రకాల మందులు, ఇతర ఇంజక్షన్లు, క్లోరిన్ మాత్రలు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. దొడ్డిపట్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి డాక్టర్ జాన్‌లియో మాట్లాడుతూ గ్రామంలోని గర్భిణులకు, బాలింతలకు, చంటి పిల్లలకు సిబ్బందిని నిత్యం అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. ఫీవర్ సర్వే చేసి జ్వర లక్షణాలు ఉన్న వారికి అవసరమైన చికిత్స అందిస్తున్నామన్నారు.

'ఇన్నర్ వీల్' పట్టణ కార్యవర్గం ఎన్నిక


నూతనంగా ఎన్నికైన ఇన్నర్ వీల్ క్లబ్ కార్యవర్గం

సాక్షి, భీమవరం: ఇన్నర్ వీల్ క్లబ్ డిస్ట్రిక్ట్ 302 చైర్‌పర్సన్‌గా పట్టణానికి చెందిన గంధం శ్రీదేవి నియమితులయ్యారు. అంతర్జాతీయ ఇన్నర్ వీల్ మహిళా క్లబ్ ఆధ్వర్యంలో భీమవరం ఇన్నర్ వీల్ క్లబ్, భీమవరం బ్లోసమ్స్ నిర్వహణలో స్థానికంగా ఆదివారం జరిగిన కార్యక్రమంలో శ్రీదేవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇన్నర్ వీల్ క్లబ్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. బాలికా విద్యకు ప్రోత్సాహం అందిస్తున్నామని, మహిళా సాధికారతకు పెద్దపీట వేసి, వృద్ధుల సంక్షేమానికి పాటుపడతామన్నారు. మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్‌గా నియమితులైన గంధం శ్రీదేవిని అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని సూచించారు. క్లబ్ ప్రెసిడెంట్ చీడే అమ్మాజీ, వైస్ చైర్‌పర్సన్‌గా లక్ష్మి శ్రీనివాస్, ఈఎస్ఓగా అరుణశ్రీ, సెక్రటరీగా డాక్టర్ ఆరేటి రాణి, ట్రెజరర్‌గా డి.సావిత్రి, ఐఎస్ఓగా సౌందర్య, ఎడిటర్‌గా రాధిక బాధ్యతలు స్వీకరించారు. ప్రమీల విజయబాబు, బుద్ధవరపు కనకదుర్గ తో పాటు 15 మంది పీడీసీలు పాల్గొన్నారు.

మావుళ్లమ్మకు పూజలు

భీమవరం (ప్రకాశం చౌక్): పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ నందుపు వెంకటేశ్వరరావు, విజయలక్ష్మి దంపతులు దర్శించుకున్నారు. రూ.5 లక్షలను అమ్మవారి ఆలయ అభివృద్ధి పనులకు వెచ్చించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఈఓ, ఆలయ సహాయ కమిషనర్ యర్రంశెట్టి భద్రాజీ, ధర్మకర్త రామాయణం సత్యనారాయణకు హామీ ఇచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జునశర్మ పూజాది కార్యక్రమములు నిర్వహించారు. ఆలయ మర్యాదలతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు.

మార్కెటింగ్ కల్పించాలి

పెనుగొండ: చేనేత కార్మికులకు ప్రతి నియోజకవర్గంలో మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని జాతీయ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర యువజన అధ్యక్షుడు అల్లాడి సూర్య భాస్కర్‌రావు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆచంట వేమవరంలో చేనేత కార్మికుల సమస్యలను ఇంటింటికీ వెళ్లి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి వస్తున్న, రావాల్సిన సబ్సిడీలు, ఉచిత కరెంటు, నేతన్న నేస్తంలపై ఆరా తీశారు. చేనేతలకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు తాళ్ల కుమారస్వామి, కార్మికులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'గూడెం'లో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం


తాడేపల్లిగూడెం మాగంటి కల్యాణ మండపంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: పట్టణ శివారు మాగంటి కల్యాణ మండపంలో ఆదివారం ఉచిత కేన్సర్, దంత, బీపీ, సుగర్, చర్మ వ్యాధులకు సంబంధించి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బోళ్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం జీఎస్ఎల్ ఆసుపత్రి వైద్యుల పర్యవేక్షణలో ఈ శిబిరం నిర్వహించారు. పట్టణ, పరిసర గ్రామాల నుంచి రోగులు పెద్ద సంఖ్యలో శిబిరానికి చేరుకున్నారు. సుమారు 30 మంది వైద్యులు 450మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. బోళ్ల ఫౌండేషన్ ప్రతినిధి రమేష్ పర్యవేక్షించగా, ఆత్మబంధువులం సేవా సంఘం వారు సహకారం అందించారు.

విజయవాడ తరలివెళ్లిన రేషన్ డీలర్లు


రేషన్ డీలర్ల రాష్ట్ర మహాసభకు తరలివెళ్తున్న తణుకు రేషన్ డీలర్లు

తణుకు టౌన్: విజయవాడలో జరిగే రాష్ట్ర రేషన్ డీలర్ల మహాసభకు తణుకు పట్టణం నుంచి రేషన్ డీలర్లు తరలి వెళ్లారు. ఆదివారం తణుకు తహసీల్దార్ కార్యాలయం నుంచి సుమారు 50 మంది రేషన్ డీలర్లు ప్రత్యేక బస్‌లో విజయవాడ తరలివెళ్లారు. విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి డీలర్ల మహాసభకు రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొంటారని డీలర్లు తెలిపారు. ఈ మహాసభలో డీలర్ల సమస్యలు పరిష్కారం కోసం, ఉద్యోగ భద్రత, తదితర అంశాలపై చర్చించడం జరుగుతుందని తణుకు మండల రేషన్ డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడు టీఎస్ రవికుమార్ తెలిపారు.

చినతాడేపల్లిలో హోమియో వైద్య శిబిరం

తాడేపల్లిగూడెం రూరల్: స్వచ్ఛంద సంస్థలు, దాతలు ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని చినతాడేపల్లి సర్పంచ్ పిచ్చికల రాజారావు అన్నారు. విశ్వ మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని చినతాడేపల్లి గ్రామంలో ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. తొలుత శిబిరాన్ని సర్పంచ్ రాజారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోమియో వైద్యం ద్వారా ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవన్నారు. వాతావరణం మారడంతో ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. అనంతరం హోమియో వైద్యులు నిమ్మల రామారావు 61మందికి బీపీ, సుగర్, కీళ్లు, నడుం నొప్పి, గుండె, కిడ్నీ, శ్వాసకోశ వ్యాధులకు వైద్య సేవలందించారు. గ్రామస్తులు, విశ్వమానవత సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

బీచ్‌లో పర్యాటకుల జోరు

మొగల్తూరు: కేపీ పాలెం బీచ్‌కు ఆదివారం పర్యాటకులు తరలివచ్చారు. ఉదయం నుంచి చల్లని మబ్బులతో వాతావరణం అహ్లాదకరంగా ఉండటంతో పర్యాటకులు సముద్రస్నానం చేస్తూ సెదతీరారు. పర్యాటకుల రాకతో బీచ్ రోడ్డు కిటకిటలాడింది. సముద్ర స్నానం అనంతరం పర్యాటకులు తీరంలోని వేంకటేశ్వరస్వామి, వేలాంకణీ మాత, పాండురంగ స్వామి, 54 అడుగుల అభయాంజనేయ స్వామి, షిర్డీ సాయిబాబా, అష్టలక్ష్మి ఆలయాలను దర్శించుకున్నారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్ట్

నరసాపురం రూరల్: మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామంలోని పేకాట శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో దేవునితోటలో పేకాడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్సై సుధాకర్ రెడ్డి తెలిపారు. వారి వద్ద నుంచి రూ14,500 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

క్షీరారామలింగేశ్వరునికి ఎస్పీ పూజలు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామిని జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్, ఆయన మిత్రులు దర్శించుకున్నారు. ఆదివారం ఆలయానికి వచ్చిన ఎస్పీ మిత్రులు స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఎస్పీ రవి ప్రకాష్ కూడా వచ్చి వారితో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం వేదాశీర్వచనం చేశారు. ఆలయ చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఆలయ సూపరింటెండెంట్ మెండెం స్వామిలు ఎస్పీని స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి చిత్రపటాన్ని అందజేశారు. పూజా కార్యక్రమాలు అనంతరం స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. పట్టణ సీఐ దారావత్తు రాంబాబు పాల్గొన్నారు.